# సిపిఐ(ఎం)

## 1964-2014

# ఆంధ్రప్రదేశ్‌లో యాభైఏళ్ల ఉద్యమ పథం

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)
ఆంధ్రప్రదేశ్

# ఉద్యమ పథంలో ఆంధ్రప్రదేశ్

ఎర్రజండా... కమ్యూనిస్టు ఉద్యమం అంటే ప్రజల తరపున నిలబడే శక్తిగా అందరికీ గౌరవం. నమ్మకం. స్వార్థం, సంకుచితత్వం, సంపదలపై వ్యామోహం, పదవుల కలహాలు, కులమత రాజకీయాలూ వెర్రితలలు వేస్తున్న కాలం ఇది. ఇలాటి కలుషిత కల్లోలిత వాతావరణంలో నిశ్చలంగా ప్రజల తరపున నిలబడి పోరాడుతున్న శక్తి భారత కమ్యూనిస్టు పార్టీ(మార్క్సిస్టు) - సిపిఐ(ఎం). దేశంలో వామపక్ష శక్తులలో అగ్ర భాగాన నిల్చిన అరుణారుణ చైతన్యం.

దోపిడీ పీడనలకు వ్యతిరేకంగా- అంతర్జాతీయ ఆధిపత్య పోకడలకు ప్రతిఘటనగా-మతోన్మాద రాజకీయాలపై రణభేరిగా- కుల వివక్షపై మోగే శంఖారావంగా - యువతీ యువకుల ఆశయ స్వచ్ఛతకు నిదర్శనంగా- దేశ రాజకీయాలను ప్రభావితం చేసే శక్తిగా -

అర్ధశతాబ్ది పూర్తి చేసుకున్న ప్రజాస్వామ్య ప్రగతిశీల రాజకీయ శక్తి సిపిఐ(ఎం). దేశంలో చాలా పార్టీలు రకరకాల అవినీతి ఆరోపణల్లో కూరుకుపోయాయి. అనేక విధాల అవకాశవాదాలతో రంగులు మార్చాయి. కాని సిపిఐ(ఎం),వామపక్షాలు ఈ యాభై ఏళ్లలోనూ సామ్యవాద భావజాలానికి లౌకిక ప్రజస్వామ్య విలువలకు అంకితమై వాటిని కాపాడేందుకు ఎల్లవేళలా కృషి చేస్తున్నాయి.

భారత దేశంలో కమ్యూనిస్టు పార్టీ స్థాపనకు 1920లలో అంకురార్పణ జరిగింది.కమ్యూనిస్టు పార్టీకి ఇది 95వ వార్షికోత్సవం. తెలుగునాట 1934లో విజయవాడలో కమ్యూనిస్టుపార్టీ తొలి సమావేశం జరిగింది. ఈ దేశంలో ఎర్రజండా ఎగిరిన రోజునుంచి స్వాతంత్రం సామ్యవాద భావజాలం కోసం కమ్యూనిస్టులు అంకితమైనారు. గాంధీజీ నాయకత్వంలో కాంగ్రెస్ ప్రధాన భూమిక పోషించినా ప్రజల తరపున నూతన భావాలను ప్రతిపాదించిన వారు కమ్యూనిస్టులే. విదేశీ పాలకులు ఇక్కడి వనరులను ముడిపదార్థాలను కొల్లగొట్టి తమ సరుకులు మనపై రుద్దేవారు. మన రైతులను వ్యవసాయాన్ని నాశనం చేసి తమకు అవసరమైన టీ కాఫీ పొగాకు నీలి మందు తదితర వాణిజ్య పంటలను అలవాటు చేశారు. స్వదేశీ సంస్థానాధీశులు రాజులు, జమీందారులు, దొరలను తాబేదార్లుగా చేసుకుని రైతాంగాన్ని శ్రమ జీవులను క్రూరంగా కొల్లగొట్టారు. అయినా ఈ రాజులు జమీందార్లపై పోరాటం అవసరంలేదన్నది గాంధీజీ భావనగా వుండేది. అలాటి సమయంలో

కమ్యూనిస్టులే భూస్వామ్య రాచరిక వ్యతిరేక పోరాటాలకు నాంది పలికారు. కేరళలో పున్నప్రా-వయిలార్, బెంగాల్‌లో తెభాగ, త్రిపుర సంస్థానం, తెలుగునాట ఉత్తరాన మందసా నుంచి మునగాల పరగణా, చల్లపల్లి జమీందారు వంటి వారికి వ్యతిరేకంగా పోరాటాలు నడిపారు, దీనంతటికి శిఖర స్థాయిలో వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నిర్వహించారు. ఆ విధంగా శ్రమజీవులనూ అణగారిన తరగతులను కదిలించి గొంతునిచ్చింది విముక్తి సమరాలకు ముందు నిలిచింది కమ్యూనిస్టులే. అప్పటి వరకూ మహజర్లకూ అధినివేశ ప్రతిపత్తి వంటి కోర్కెలకు పరిమితమైన కాంగ్రెస్ కమ్యూనిస్టుల వచ్చాకే సంపూర్ణ స్వాతంత్రం నినాదమిచ్చింది. అమరజీవి భగత్‌సింగ్‌తో సహా ఎందరో జాతీయ విప్లవ యోధులు కమ్యూనిస్టు భావజాలం వైపు ఆకర్షితులైనారు. ఆయన బృందాన్ని ఉరితీసినా మిగిలిన సహచరులంతా కమ్యూనిస్టు పార్టీ వైపు వచ్చారు. ఈ కారణం చేతనే బ్రిటిష్ పాలకులు కమ్యూనిస్టు పార్టీపై ప్రత్యేకంగా కక్ష గట్టారు. దశాబ్దాలుగా వుంటున్న కాంగ్రెస్‌పై ఎన్నడూ ఏ నిషేధం లేదు. కాని అప్పుడప్పుడే మొదలవుతున్న కమ్యూనిస్టుపార్టీనే బ్రిటిష్ పాలకులు నిషేదించారు. కేసులమీద కేసులు పెట్టి వేధించారు.కొన్ని వేలమంది కమ్యూనిస్టులను పాలకులు వూచకోత కోశారు. జైళ్లపాలు చేశారు. కమ్యూనిస్టులు గాంధీజీ లాగే దేశీయ ఆర్థికాభివృద్ధిని కోరుకున్నారు. 1920లలోనే దేశంలో కమ్యూనిస్టులు, మరోవైపున ఆరెస్సెస్ ముందుకొచ్చాయి. కమ్యూనిస్టులు ఇన్నిరకాల ప్రజలతో మమేకమవుతుంటే ఆరెస్సెస్ కేవలం ముస్లిం వ్యతిరేకతే ప్రధానమన్నట్టు వ్యవహరిస్తూ స్వాతంత్ర పోరాటానికి దూరంగా వుండిపోయింది, బ్రిటిష్ వారు కూడా మతతత్వ రాజకీయాలను పెంచి పోషించడంతో చివరకు దేశ విభజన ఘోర మతమారణహోమం చూడవలసి వచ్చింది. స్వాతంత్రం వచ్చి ఆరు నెలలు కాకుండానే ఒక హిందూ మతోన్మాది మహాత్మాగాంధీని క్రూరంగా కాల్చి చంపాడు, కమ్యూనిస్టులు మాత్రం మతసామరస్యం దేశ స్వావలంబన కోసం కట్టుబడ్డారు.

## సైద్ధాంతిక స్వచ్ఛత కోసం..

స్వాతంత్రానంతరం కాంగ్రెస్ పాలకులు విదేశీ రుణాలపై మారుటోరియం ప్రకటించి బ్రిటిష్‌పెట్టుబడులను స్వాధీనం చేసుకునే బదులు వారితో మరింతగా కుమ్మక్కయ్యారు. ప్రజా వ్యతిరేక విధానాలతో ధనస్వాములను భుజాన మోశారు. అవకాశవాద పోకడలతో అస్తవ్యస్త పరిస్థితి సృష్టించారు. ఈ నేపథ్యంలో మరింత సమరశీల పోరాటాలకు సిద్ధమయ్యే బదులు వారిపట్ల మెతక వైఖరి అనుసరించాలని కమ్యూనిస్టు ఉద్యమంలోనే కొందరు ప్రతిపాదించారు. దాంతో విభేదించిన పుచ్చలపల్లి సుందరయ్య, ఎ.కె.గోపాలన్, బి.టి.రణదివే, హరికిషన్ సింగ్ సూర్జిత్, పి.రామమూర్తి, ప్రమోద్‌దాస్‌గుప్తా, మాకినేని బసవపున్నయ్య, జ్యోతిబాసు, నంబూద్రిపాద్, ముజఫర్ అహ్మద్, తదితరులు తీవ్ర సైద్ధాంతిక

పోరాటం నడిపారు. అంతేగాక విప్లవ కర సిద్ధాంత స్వచ్ఛత కోసం ప్రజా పోరాటాల పదును పెంచడం కోసం నూతన సంస్థను స్థాపించాలన్న నిర్ణయానికి వచ్చారు.. ఈ ఏర్పాటులో ఆంధ్ర ప్రదేశ్‌కు చెందిన సుందరయ్య, బసవపున్నయ్య, మోటూరు హనుమంతరావు, నండూరి ప్రసాదరావు, తరిమెల నాగిరెడ్డిలతో పాటు ఇంకా అనేకులు ముఖ్యపాత్ర వహించారు. వారు ఈ ఆలోచనలు చేస్తున్న దశలోనే 1962లోనే చైనా యుద్ధాన్ని సాకుగా చూపి కమ్యూనిస్టు ఉద్యమంలో ఒక భాగాన్ని జైలుపాలు చేశారు. అయినా గట్టిగా నిలబడి 1964 జులై7 నుంచి జులై 12 వరకూ తెనాలిలో జాతీయ సదస్సు జరిపి నూతన పార్టీ స్థాపనకై నిర్ణయించారు. ఈ లోగానే రాష్ట్రంలో పాలకులు కుటిల పన్నాగాలు ప్రారంభించారు. విజయవాడలో 1964 జూన్ 11న కృష్ణలంక,భ్రమరాంబపురంలో అగ్ని ప్రమాదం జరిగి రెండువేల ఇండ్లు కాలిపోయాయి. కమ్యూనిస్టులు తమలో తాము చీలిపోయి ఈ విధంగా గుడిసెలు తగలబెట్టారని కాంగ్రెస్ వారు తీవ్ర దుష్ప్రచారం మొదలు పెట్టారు. కమ్యూనిస్టులు ఆ ప్రచారాన్ని ఖండించినా పట్టించుకోకుండా ముఖ్య నేతలపైనే కేసులు పెట్టి అరెస్టు చేశారు. అహోరాత్రులు మేల్కొని అగ్ని ప్రమాదాలు జరక్కుండా కాపలా కాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. మొత్తంపైన నిర్బంధం మధ్యనే 1964 నవంబరు7న భారత కమ్యూనిస్టు పార్టీ(మార్క్సిస్టు) ఏర్పడింది. పుచ్చలపల్లి సుందరయ్య తొలి ప్రధాన కార్యదర్శి అయ్యారు. మరోవైపున పాలకులు. సిపిఐ రష్యా అనుకూల పార్టీ అనీ, సిపిఎం చైనా అనుకూల పార్టీ అని తాడూ బొంగరం లేని ప్రచారాలు చేశారు. వాస్తవానికి సిపిఎం నాడూ నేడూ కూడా స్వతంత్ర విధానాన్ని అనుసరిస్తోంది. ఈ దేశ పరిస్థితులకు తగిన నిర్దిష్ట విధానాన్ని నిర్ణయించుకుంటూ ముందుకు సాగుతుందేగాని మరో దేశపు నమూనాను అనుకరించదు.

**దుష్ప్రచారం, దాడి**

సిపిఎం పూర్తిగా ఏర్పడక ముందే ప్రభుత్వం దాడి ప్రారంభించింది. చైనాతో తలెత్తిన సరిహద్దు సంఘర్షణను సంప్రదింపులతో పరిష్కరించుకోవాలని చెప్పడం పెద్ద అపరాధంగా చిత్రించబడింది. ఇప్పుడు దేశ ప్రధాని నరేంద్ర మోడీతో సహా అందరూ చైనాతో స్నేహ సంబంధాలు పెంచుకోవాలనే చెబుతున్నారు. ఆ రోజుల్లో సిపిఎం చెప్పిందీ అదే. దీనికోసమే సిపిఎం నేతలపై చైనా ఏజంట్లని ముద్ర వేశారు.లోక్‌సభలో అప్పటి హోంమంత్రి గుల్జారీ లాల్ నందా సిపిఎంపై ఆరోపణలతో ఒక చిట్టా చదివారు. అంతేగాక దేశమంతటా వున్న సిపిఎం నేతలను అర్థరాత్రి అరెస్టు చేశారు. ఆంధ్ర ప్రదేశ్‌లోని అన్ని జిల్లాల్లో ముఖ్యమైన నాయకులంతా జైళ్లపాలయ్యారు. బ్రిటిష్ వారు ఏ విధంగా కాంగ్రెస్‌ను గాక కమ్యూనిస్టుపార్టీని నిషేధించారో అలాగే కాంగ్రెస్ కేంద్ర ప్రభుత్వం కూడా సిపిఎంపై కక్ష గట్టి ఆదిలోనే దాడి చేసింది. ఇందుకోసం ప్రివెంటివ్ డిటెన్షన్(పిడి)చట్టాన్ని పెద్ద ఎత్తున ప్రయోగించింది.

అయితే అలా నాయకులందరినీ అరెస్టు చేసి జైళ్లలో కుక్కినా అప్పుడప్పుడే ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు ఎంతో ధైర్యంగా ప్రజల పక్షాన నిలబడ్డారు. సమస్యలపై ఉద్యమాలు సాగించారు. బంజరు భూముల పంపిణీ, డ్రైనేజీల మరమ్మత్తులు వంటి అంశాలపై పోరాడారు. ప్రజాశక్తి పత్రికస్థానంలో ఎన్నో త్యాగాలు చేసి సమిష్టి కృషితో నిర్మించుకున్న విశాలాంధ్ర పత్రిక సిపిఐ చేతికిపోగా సిపిఎం తరపున డి.వి.సుబ్బారావు తదితరులు జనశక్తి పత్రిక స్థాపించారు. అరెస్టయిన నాయకుల విడుదల కోసం ఎందరో మేధావులు పౌర హక్కుల ఉద్యమం నడిపించారు. కొద్ది రోజుల తర్వాత ఆ మేధావులను కూడా అరెస్టు చేశారు. నాటి పత్రికల్లో కూడా హక్కుల కోసం జరిగే పోరాటాలకు ఇప్పుడు వస్తున్న పాటి ప్రచారం కూడా వచ్చేది కాదు. జైళ్లలోని డిటెన్యూల భార్యలు పిల్లలూ ప్రత్యేకంగా పోరాడిన తర్వాతనే ప్రభుత్వం కనీస హక్కులు సదుపాయాలు కలిగించింది. కనక సిపిఎం పుట్టుకే పోరాటాలతో జరిగింది.

**ఉద్యమాలకు తోడ్పాటు**

కాంగ్రెస్ అభ్యుదయ పాత్ర గురించి దానితో చేతులు కలపాల్సిన అవసరం గురించి కమ్యూనిస్టు ఉద్యమంలో ఒక భాగం మోతెత్తిస్తున్న తరుణంలోనే సిపిఎం సమరశీల ప్రజా ఉద్యమాలను పునరుద్ధరించేందుకు, కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడేందుకు ఎంతో దీక్షగా పోరాడింది. శాసనసభలో సిపిఎం నేతలు రాజకీయంగా గట్టి పోరాటం చేసేవారు. శాసనసభలో సుందరయ్య సిపిఎం పక్ష నేతగా వుండగా తరిమెల నాగిరెడ్డి ఉపనేతగా పనిచేశారు. ఉపాధ్యాయ ఉద్యోగ వర్గాల సమస్యలపై ఆరోజుల్లో అనేక హక్కులు సాధించుకోగలిగారు. 1966లో విశాఖ ఉక్కు ఉద్యమం ఆంధ్ర ప్రదేశ్‌ను వూపేసింది. ఆ సమయంలో సిపిఎం శాసనసభ్యులందరూ రాజీనామా చేసి సంఘీభావం ప్రకటించారు. అంతేగాక వివిధ సమస్యలపై జిల్లాలలోనూ విస్తారమైన ఉద్యమాలు నడిచాయి.

**ఉగ్రవాద విచ్ఛిన్నం**

1967 ఎన్నికల నాటికి దేశవ్యాపితంగా కాంగ్రెస్ తొమ్మిది రాష్ట్రాలలో ఓటమి పాలైంది. ఆంధ్ర ప్రదేశ్ శాసనసభలో సిపిఎంకు 9 మంది సభ్యులు ఎన్నికైనారు. సంయుక్త విధాయకదళ్ పేరిట చాలా రాష్ట్రాల్లో కాంగ్రెసేతర ప్రభుత్వాలేర్పడ్డాయి. ఈ వూపుతో వెంటనే సాయుధ విప్లవం వచ్చేస్తుందని కొంతమంది తీవ్రవాద పంథా తొక్కారు. మితవాదం నుంచి బయిటపడి ఉద్యమాన్ని పునరుద్ధరించుకునేలోపునే ఈ ఉగ్రవాద విచ్ఛిన్నం సంభవించి శత్రువులకు సంతోషం కలిగించింది. సిపిఎంలో దీక్షా దక్షతలకు పేరొందిన ఎందరో మెరికల్లాంటి కార్యకర్తలు ఆ దుస్సాహసిక ఒంటెత్తువాద ధోరణికి లోనైనారు. ఆ దశలో పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో రాష్ట్ర ప్లీనం జరిగింది. అక్కడ ఈ ధోరణి పరాకాష్టకు చేరింది. ఈ విధంగా ఒక వైపున ప్రభుత్వంతో రాజీ పడే మితవాద వైఖరి, మరో వైపున

ప్రజలను దారి తప్పించే ఉగ్రవాద వైఖరి ఎడాపెడా పెడధోరణులుగా దాపురించాయి. ఆంధ్ర ప్రదేశ్‌లో ఈ విచ్ఛిన్నం చాలా తీవ్రంగా వుండింది. సిపిఎం స్థాపించుకున్న జనశక్తి పత్రిక కూడా ఈ క్రమంలో నక్జలైట్ల పరమైంది. ప్రజాశక్తి పునరుద్ధరించబడింది. ఎన్నికలను బహిష్కరించాలనే పేరిట శాసనసభలో సిపిఎం నాయకుడుగా వున్న తరిమెల నాగిరెడ్డి సభకు రాజీనామా చేశారు. ఇలాటి వాటిని ఎదుర్కొంటూనే ప్రజా ఉద్యమాలను కాపాడుకోవడానికి, ప్రజల హక్కులను రక్షించడానికి నాయకత్వం కార్యకర్తలు అహోరాత్రాలు కృషి చేశారు. పైగా నక్జలైట్ల సైద్ధాంతిక దాడి యావత్తూ సిపిఎంపైనే కేంద్రీకరించారు. భౌతికంగానూ దాడులకు పాల్పడ్డారు. పాలకులు దాన్ని అవకాశంగా తీసుకుని మరోసారి తీవ్ర నిర్బంధం సాగించారు. అయినప్పటికీ ప్రభుత్వం ఎన్‌కౌంటర్ల పేరిట వారిని కాల్చివేయడం సరికాదని సిపిఎం తీవ్ర నిరసన తెల్పింది. సుందరయ్య స్వయంగా ప్రధానికి మెమోరాండం సమర్పించారు.

**సబ్ కా నామ్ వియత్నాం**

ఈ కాలంలో అంతర్జాతీయంగా వియత్నాం విముక్తి పోరాటం గొప్ప స్ఫూర్తి నిచ్చింది. తెలుగు నాట కూడా ఆ సంఘీభావ ఉద్యమం పెద్ద ఎత్తున జరిగింది. నాటి తరాన్ని వియత్నాం తరం అనేంతగా అంతర్జాతీయ సౌహార్ద్రత వెల్లివిరిసింది.

**జై తెలంగాణ ఉద్యమం**

ఈ సంక్లిష్ట వాతావరణం ఇలా వుండగానే రాష్ట్ర కాంగ్రెస్‌లో ముఠాల యుద్ధం ముదిరి 1969-70లలో ప్రత్యేక తెలంగాణ వాదం తెరపైకి వచ్చింది. దేశవ్యాపిత ఆర్థిక రాజకీయ సంక్షోభం, ఇందిరాగాంధీ నాయకత్వం బలహీనపడటంతో పాటు ప్రాంతాల మధ్య అవగాహనకు సంబంధించిన అవకతవకలు అందుకు ఆజ్యం పోశాయి. అప్పటి వరకూ అనేక పదవులు అనుభవించిన మర్రి చెన్నారెడ్డి కోర్టు తీర్పు కారణంగా మంత్రి పదవి కోల్పోవలసి రావడంతో ఈ ఉద్యమంలో దూకి నాయకత్వం చేపట్టాడు. అసలు సమస్యల నుంచి దృష్టి మరల్చే విధంగా ఇతర ప్రాంతాల ప్రజలపై దాడులు ప్రోత్సహించాడు. అలాటి సమయంలో తెలుగు ప్రజల ఐక్యత కోసం సిపిఎం కార్యకర్తలు నాయకులు ప్రత్యక్షంగా రంగంలో నిలబడి ఈ దాడులను తిప్పికొట్టారు. అప్పటికే దేశవ్యాపితంగా కాంగ్రెస్ రెండుగా చీలిపోయి ఒక వర్గం(పాత కాంగ్రెస్- సిండికేటు) అత్యంత అభివృద్ధి నిరోధక నినాదాలు ముందుకు తెచ్చింది. మరోవైపున ఇందిరాగాంధీ కొత్తకాంగ్రెస్(ఇండికేటు) అభ్యుదయ నినాదాలిస్తూనే ఏకపక్ష నిరంకుశ పోకడలు నిర్బంధాలు తీవ్రం చేశారు. ఈ లోగా బంగ్లాదేశ్ యుద్ధంలో విజయం సాధించడం ఇందిరాగాంధీ ప్రతిష్ట పెంచింది. ఈ క్రమంలో 1971లోక్‌సభ ఎన్నికలలో సిపిఐ ఇందిరాగాంధీని బలపర్చగా సిపిఎం ఉభయ కాంగ్రెస్‌లనూ ఓడించాలని పిలుపునిచ్చింది. చెన్నారెడ్డి తెలంగాణ ప్రజాసమితి(టిపిఎస్) ఏర్పాటు చేసి

ఇందిరాగాంధీపై తిరుగుబాటు చేశారు. ఆ ప్రాంతంలోని పార్లమెంటు స్థానాలన్నీ వారికే రాగా నల్గొండ జిల్లా మిర్యాలగూడలో మాత్రం సిపిఎం తరపున బిఎన్‌రెడ్డి పార్లమెంటుకు ఎన్నికైనారు. ఆ సమయంలో ప్రత్యేక తెలంగాణ పేరిట సాగుతున్న పాలకవర్గ కలహాల నిజస్వరూపాన్ని సిపిఎం శక్తివంతంగా బహిర్గతం చేసింది.

**రూపాయకు కిలోబియ్యం**

ఆర్థికంగా చూస్తే పభుత్వ విధానాల కారణంగా దేశంలో ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ముఖ్యంగా రాష్ట్రంలో బియ్యం ధరలు మండిపోయాయి. అలాటి తరుణంలో చౌకదుకాణాల ద్వారా రూపాయకు కిలో బియ్యం అందించాలని సిపిఎం ఆందోళన చేసింది. అంతేగాక గన్నవరం ప్రాంతంలో ఆ విధంగా ప్రజలకు తానే అందించింది కూడా. మరికొన్ని చోట్ల పరిమితంగా జరిగింది. ఈ విధంగా ఒక ప్రతిపక్ష పార్టీ ఈ విధమైన కార్యక్రమం అమలు చేయడం అదే ప్రథమం. సహజంగానే ఇది ప్రభుత్వానికి మింగుడుపడలేదు. 1972లోనే పశ్చిమ బెంగాల్‌లో ఇందిరాగాంధీ అర్ధ ఫాసిస్టు బీభత్స కాండ సాగించి ఎన్నికలను బూటకంగా మార్చివేసింది. ఆ సమయంలో జ్యోతిబాసును రాష్ట్రానికి ఆహ్వానించి ముఖ్య కేంద్రాలలో సభలు జరిపి సంఘీభావం ప్రకటించింది. బెంగాల్ పరిస్థితిపై జ్యోతిబాసు రాసిన పుస్తకం వేల ప్రతులు విక్రయించింది.

**జై ఆంధ్ర ఉద్యమం**

1972-73లో మరోసారి ప్రాంతీయ ఉద్యమాలు ప్రజ్వరిల్లాయి. ఈ సారి జైఆంధ్ర పేరిట కాంగ్రెస్, జనసంఘం,స్వతంత్ర పార్టీ వంటివాటికి చెందిన నాయకులు ఇతరులు ప్రత్యేక ఉద్యమం నడిపారు. కేంద్రంలోని ఇందిర ప్రభుత్వం ఆ సమస్యపట్ల సహేతుక వైఖరి తీసుకునే బదులు నిర్బంధాన్ని ప్రయోగించింది. ఏడాదిపాటు పరిపాలన చదువులు స్తంభించిపోయాయి. గవర్నర్ పరిపాలన నడిచింది. ఆ సమయంలో సిపిఎం సమైక్యత కోసం గట్టిగా నిలబడి అనేక శాస్త్రీయ పరిష్కారాలు ప్రతిపాదించింది. తెలంగాణలో లాగే ఇక్కడ కూడా పాలక కాంగ్రెస్ ముఠా తగాదాలు ఇలాటి పరిస్థితికి దారితీశాయని ఎండగట్టింది. నిజంగానే ఆ తర్వాత వారిలో వారు ఆ తగాదాలు పక్కనబెట్టి జలగం వెంగళరావు నాయకత్వంలో పదవులు పంచుకుని ప్రభుత్వం ఏర్పాటు చేశారు. ఖమ్మం జిల్లాలో కమ్యూనిస్టు వ్యతిరేకతకు పేరు మోసిన జలగం అధికారం చేపట్టిన తర్వాత సిపిఎంపై కక్షగట్టి దాడి చేశారు. ఆ దశలో కృష్ణాజిల్లా ఉయ్యూరులో జరిగిన ఉప ఎన్నికలో సిపిఎం బలపర్చిన ఇండిపెండెంటు అభ్యర్థి గెలవడం ఆయన సహించలేకపోయాడు. గన్నవరం దగ్గర తన కారుపై దాడి చేశారనే నెపంతో విపరీతమైన నిర్బంధాన్ని ప్రయోగించాడు. అరెస్టులు వేధింపులు నిత్యకృత్యమైనాయి. ఇలాటి దాడులను తట్టుకుంటూ ఉద్యమాన్ని కాపాడుకోవడమే గాక ప్రజల పక్షాన నికరంగా నిలబడిన ఘనత సిపిఎంకు దక్కుతుంది. ఆ దశలోనే

బూటకపు భూ సంస్కరణలకు వ్యతిరేకంగా నిజమైన భూ పంపిణీ కోరుతూ పెద్ద ప్రదర్శనలు నిర్వహించింది.

## రైల్వేసమ్మె, ఎమర్జన్సీ

1974 నాటికి ఇందిరాగాంధీపై అసంతృప్తి తీవ్ర రూపం తీసుకుంది. ఆ ఏడాది ఏప్రిల్‌లో దేశవ్యాపితంగా 20 లక్షల మంది రైల్వే కార్మికులు చారిత్రక సమ్మె చేశారు. ఆంధ్ర ప్రదేశ్‌లోని అనేక రైల్వే కేంద్రాలలో ఈ సమ్మె చాలా జయప్రదంగా జరిగింది. ప్రభుత్వం దానిపై తీవ్రంగా విరుచుకుపడింది. రైల్వే కాలనీలపై దాడులు చేసి అరెస్టులు జరిపింది. ఇళ్లలోంచి వెళ్లగొట్టింది. నెమ్మదిగా దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశత్వం ఏకపక్ష గుత్తాధిపత్యం ప్రమాదకరంగా తయారవుతున్నాయని సిపిఎం హెచ్చరించింది. ఈ లోగా 1975 జూన్‌లో అలహాబాద్ హైకోర్టు ఇందిరాగాంధీ ఎన్నిక చెల్లదని తీర్పు నివ్వడంతో ఆమె పదవిని కాపాడుకోవడానికి దేశంలో అత్యవసర పరిస్థితిని విధించింది. రాష్ట్రంలో వందల మంది సిపిఎం కార్యకర్తలు అరెస్టయ్యారు. రాష్ట్ర కార్యదర్శితో సహా అనేక మంది నేతలపై వారంట్లు జారీ కావడంతో వారంతా అజ్ఞాత వాసంలోకి వెళ్లవలసి వచ్చింది. పౌర హక్కులు కాలరాచి వేయబడ్డాయి. పత్రికలపై ముందుగానే సెన్సార్‌షిప్ విధించి ప్రభుత్వ భజన జోరుగా నడిపించారు. ఆ సమయంలో కూడా సిపిఎం ప్రజా సంఘాలు వివిధ రకాల పద్ధతులతో ప్రజల మధ్య వుంటూ సమస్యలపై కృషి చేశాయి. అంతేగాక ప్రభుత్వ ప్రచారాల నిజస్వరూపాన్ని పరోక్ష పద్ధతులలో పటాపంచలు చేస్తూ ప్రజాశక్తి వారపత్రిక ద్వారానూ ఇతర ప్రచురణల ద్వారానూ తీవ్ర ప్రయత్నం జరిగింది. మొదటి నుంచి ప్రజాకళలు అభ్యుదయ సాహిత్యంలో కమ్యూనిస్టులు ముందున్నారనేది తెలిసిన విషయమే. ఎమర్జన్సీ నేపథ్యంలో ప్రజలను చైతన్య వంతులను చేసేందుకు ప్రజానాట్యమండలిని పునరుద్ధరించడం మరో విశేషం. అప్పటి అనేక ఆంక్షల మధ్యనే విద్యార్థి యువజన మహిళా ఉద్యమాలు కొనసాగాయంటే ఎంత దీక్ష క్రమ శిక్షణలతో పనిచేశారో అర్థమవుతుంది. ప్రజల పోరాటం వల్ల ఎట్టకేలకు 1977 జనవరిలో ఇందిరాగాంధీ ఎమర్జన్సీ ఎత్తివేసి ఎన్నికలు జరపాల్సి వచ్చింది. కొన్ని ప్రతిపక్షాలు కలసి జనతా పార్టీగా ఏర్పడగా సిపిఎం మద్దతు తెల్పింది. సిపిఐ కాంగ్రెస్‌తో కలసి వ్యవహరించింది. ఆ ఎన్నికల్లో దేశ వ్యాపితంగా ఇందిరాగాంధీ ఘోర పరాజయం పాలైనారు గాని రాష్ట్రంలో మాత్రం కాంగ్రెస్ 42 పార్లమెంటుస్థానాల్లో ఒక్కటి తప్ప అన్నీ గెల్చుకోగలిగింది. జనతా పార్టీ విజయానంతరం దేశంలో ఏర్పడిన ప్రజాస్వామ్య వాతావరణాన్నిుపయోగించుకుంటూ సిపిఎం ప్రజా సంఘాలు మరింత చురుగ్గా పనిచేశాయి. హెూం మంత్రిగా వుండి 300 మంది నక్సలైట్లను బూటకపు ఎన్‌కౌంటర్లలో కాల్చివేయడానికి కారణమైన జలగం వెంగళరావు ప్రభుత్వం వైదొగాలంటూ పెద్ద సమైక్య ఉద్యమ నిర్మాణానికి చొరవ తీసుకుంది. హైదరాబాదులో పెద్ద ప్రదర్శన సదస్సు జరిగి

చివరకు ఈ విషయం దర్యాప్తుచేసేందుకు జస్టిస్ భార్గవ కమిషన్ నియమించబడింది. ఈ విధంగా మొదటి నుంచి సిపిఎం పౌర హక్కుల పరిరక్షణకు విశేషంగా కృషి చేస్తూ వచ్చింది. జలగం ప్రభుత్వ బర్తరఫ్ కోరుతూ 1977 నవంబరులో రాష్ట్ర బందుతో సహా విస్తృత కార్యక్రమాలకు సన్నాహాలు జరుగుతుండగా పెనుతుపాను ఉప్పెనవచ్చి పడ్డాయి. దాంతో సహాయ కార్యక్రమాల్లో నిమగ్నమైంది. సిపిఎం ఆధ్వర్యంలో ఏర్పడిన ప్రజా రక్షక దళాలు ప్రజా వైద్యదళాలు అందరికన్నా ముందే దివిసీమకు చేరుకుని సేవలందించడం మన్నన పొందింది. ఈ సందర్భంగా సేకరించిన విరాళాలతో తర్వాత కృష్ణా జిల్లా సత్యనారాయణ పురంలో ఒక తుపానురక్షణ కేంద్రం కూడా నిర్మించి ఇచ్చారు.

**ఎన్నికల విజయాలు, ఉద్యమాలు**

1978 శాసనసభ ఎన్నికల్లో సిపిఎం జనతాపార్టీ కలసికట్టుగా పోటీ చేశాయి. సిపిఐ కాంగ్రెస్‌తో అవగాహన కుదర్చుకుంది. ఆ ఎన్నికల్లో ఇందిరాగాంధీ కాంగ్రెస్ ఇక్కడ విజయం సాధించినా ప్రతిపక్షాలు కూడా గణనీయంగా స్తానాలు పొందాయి. జనతా పార్టీ60, స్తానాలు తెచ్చుకోగా సిపిఎం ఎనిమిది చోట్ల విజయాలు సాధించింది. ఇతర ప్రతిపక్షాలకూ సిపిఐకీ కలసి మరో నలభై పైగా స్థానాలుండేవి. దీన్ని ఆధారం చేసుకుని బలమైన ఉద్యమాలను బలోపేతం చేసుకునే ప్రయత్నం జరిగింది. ఆ ఏడాదిలోనే డివైఎఫ్ఐ కూడా ఏర్పడింది. చెన్నారెడ్డి ప్రభుత్వంపై వచ్చిన అవినీతి ఆరోపణలకు తోడు హైదరాబాదులో లాకప్‌డెత్, రమిజాబీ షకీలాలపై అత్యాచారాల వంటి ఘటనలు తీవ్ర అలజడికి దారితీశాయి. ఈ అంశాలన్నిటిలోనూ సిపిఎం ముందుండి మిగిలిన పక్షాలను సమీకరిస్తూ వచ్చింది. ఇవి సహించలేని చెన్నారెడ్డి ప్రభుత్వం నక్సలైట్లను అడ్డం పెట్టుకుని వందలాది మంది సిపిఎంకార్యకర్తలను నాయకులను హత్య చేయించింది. దానిపై తీవ్ర నిరసనోద్యమం జరిగింది. 1979లోనే ఉభయ వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యాన భూ పోరాటం జరిగింది. నెల్లూరు జిల్లాలో కాల్పుల్లో ఒకరు చనిపోయారు. చెన్నారెడ్డి ప్రభుత్వం విద్యుత్ హార్స్‌పవర్‌రేటు పెంచడంపై ప్రారంభమైన నిరసన 1980లో ఒక అఖిలపక్ష రైతు ఉద్యమంగా పరిణామం చెందింది. విజయవాడలో బ్రహ్మాండమైన సభ ప్రదర్శన జరిగి వరుసగా రైతాంగ నిరసన కార్యక్రమాలు సాగాయి. చివరకు చెన్నారెడ్డి రాజీనామా చేసి తప్పుకోవలసి వచ్చింది.అప్పుడు విజయవాడలో జరిగిన కాల్పుల్లో ఒక కార్యకర్త మరణించడంతో ఉద్రిక్తత పెరిగింది. కొత్తగా ఏర్పడిన అంజయ్య ప్రభుత్వం ప్రతిపక్షాలతో చర్చించి రైతులకు అనేక రాయితీలు కల్పించవలసి వచ్చింది. ఆ సమయంలోనే విజయవాడ కార్పొరేషన్ ఎన్నికలలో కూడా కమ్యూనిస్టులు ఘన విజయం సాధించడం కాంగ్రెస్‌ను కంగు తినిపించింది.రాష్టంలో కాంగ్రెస్ వ్యతిరేక వాతావరణం ప్రతిపక్షాల ఐక్యతా సూచనలు పెంపొందించడంలో సిపిఎం పాత్ర అందరి మన్నన పొందింది.

**అఖిల భారత మహాసభ**

ఇందుకు తగినట్టే 1982లో సిపిఎం అఖిలభారత మహాసభ విజయవాడలో అపూర్వంగా జరిగింది.అప్పటి వరకూరాష్ట్ర చరిత్రలో లేని విధంగా పది లక్షల మంది ప్రజానీకం కృష్ణానది తీరంలో సమీకృతులై అరుణారుణ చైతన్యంచాటి చెప్పారు. మరోవైపున వరుసగా ముఖ్యమంత్రులను మారుస్తూ అవినీతి ఆరోపణలు మూటకట్టుకుంటూ కాంగ్రెస్ ప్రభుత్వం పతనావస్థకు చేరింది. 1983 జనవరి ఎన్నికలలో తొలిసారి ఉభయ కమ్యూనిస్టు పార్టీలు పొత్తు పెట్టుకుని బిజెపియేతర పార్టీలను సమీకరించేందుకు ప్రయత్నం చేశాయి. ఆ సమయంలో రంగ ప్రవేశం చేసిన సినీ కథానాయకుడు ఎన్టీరామారావు తెలుగుదేశం స్థాపించి ఘన విజయం సాధించారు. ఆయనతో కూడా సంప్రదింపులు జరిగినా అవి ఫలప్రదం కాలేదు. అయితే సిపిఎం ఎన్టీఆర్‌తో సర్దుబాట్లు చేసుకుని వుండవలసిందని తర్వాత బహిరంగంగా ఆత్మ విమర్శ చేసుకుని ఆయన ప్రభుత్వానికి స్నేహహస్తం అందించింది. 1984లో ఎన్టీఆర్ ప్రభుత్వాన్ని కేంద్రం బర్తరఫ్ చేసి నాదెండ్ల భాస్కరరావు కీలుబొమ్మ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పుడు అందుకు వ్యతిరేకంగా జరిగిన ప్రజాస్వామ్య పునరుద్ధరణ ఉద్యమంలో సిపిఎం కీలక పాత్ర వహించింది. ఇందుకుగాను ఎన్టీఆర్ ప్రత్యేకంగా జ్యోతిబాసుకు  కృతజ్ఞతలు తెలిపారు. తదుపరి కాలంలో కూడా తెలుగుదేశం వామపక్షాలు కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా కలసి వ్యవహరిస్తూ వచ్చాయి. అనేక విషయాల్లో ఎన్టీఆర్ పొరబాటు చర్యలను విమర్శిస్తూనే కాంగ్రెస్  కుట్రలను అడ్డుకోవడంలో సిపిఎం ముఖ్యపాత్ర వహించింది. ఇంకో వైపున వామపక్ష ఐక్యతను కూడా పెంపొందించేందుకు కృషి చేసింది. 1985 మే 19న కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య అస్తమయం అశనిపాతమైంది. లక్షలాది మంది ప్రజలు వివిధ పార్టీల నేతలు తరలి వచ్చి ఆయనకు నివాళులర్పించారు. సుందరయ్య స్మృతి చిహ్నంగా హైదరాబాదులో నిర్మించిన విజ్ఞాన కేంద్రం ఉత్తరోత్తరా ప్రజా ఉద్యమ ప్రతీకగా వెలుగొందుతున్నది.

**పత్తి రైతుల ఆత్మహత్యలు -అప్పుల భారం**

ప్రకాశం జిల్లాలో ప్రత్తి రైతులకు ధర పడిపోయి 1984-85లో ఆత్మహత్యలు ప్రారంభమైనప్పుడు సిపిఎం రైతుసంఘం  దేశంలోనే మొదటిసారిగా ముందుగా ఆ సమస్యను గుర్తించాయి. గిట్టుబాటు ధర సమస్యను రంగం మీదకు తెచ్చాయి. ప్రత్తికి ధర కావాలని నిర్బంధాలని ఎదిరించి పోరాడారు. కొన్ని రాయితీలు సాధించేవరకు  ఉద్యమం నడిచింది.

**గంజి కేంద్రాలు**

రాజకీయాలు, ఉద్యమాలతో పాటు సేవా కార్యక్రమాలలో కూడా సిపిఎం ఎప్పుడూ ముందుంటున్నది. 1986లో మహబూబ్‌నగర్‌లో తీవ్రమైన కరువు ఏర్పడింది.ప్రభుత్వ యంత్రాంగం అశ్రద్ధ వలన ప్రజలు సహాయం అందక నానా బాధలు పడుతున్న స్థితి.ఆ

సమయంలో సిపిఎం దాతల సహాయంతో నిర్వహించిన గంజి కేంద్రాలు ఎంతో ఉపశమనం కలిగించాయి. ఎన్టీఆర్ ప్రభుత్వానికి రాజకీయంగా మద్దతునిచ్చినా విధానాలలో తప్పిదాలను ఉపేక్షించలేదు. సంక్షేమ కార్యక్రమాలనే చెబుతూ భూ సంస్కరణల వంటివి అమలు చేయకపోవడాన్ని కూడా సిపిఎం నిరంతరం ఎత్తిచూపుతూ వచ్చింది. ఆయన మంత్రివర్గాన్ని సామూహికంగా బర్తరఫ్ చేయడం వంటి చర్యలు రాజకీయ సంక్షోభానికి కారణమయ్యాయి. 1988 చివరలో విజయవాడలో వంగవీటి మోహన రంగా హత్య తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. సిపిఎం కార్యకర్తలపైన కూడా అనేక దాడులు జరిగాయి. ఆ సమయంలో శాంతి భద్రతలు నెలకొనడానికి ప్రజలకు రక్షణ కల్పించడానికి సిపిఎం ముందు నిలబడింది. ఈ నేపథ్యంలోనే రాజీవ్‌గాంధీ ప్రభుత్వం బోఫోర్స్ కుంభకోణంలో చిక్కుకుపోయింది. దానిపై సరైన దర్యాప్తుకు అడ్డుతగులుతున్న కారణంగా లోక్‌సభలో ప్రతిపక్ష సభ్యులందరూ రాజీనామాలు చేశారు. అయితే ఎన్టీఆర్ ప్రభుత్వ ఏకపక్ష పోకడల కారణంగా 1989లో దేశమంతా ఓడిపోయిన కాంగ్రెస్ ఇక్కడ విజయం సాధించగలిగింది. అయితే దాని సహజ సిద్ధలక్షణాలవల్ల అనతి కాలంలోనే మళ్లీ ముఖ్యమంత్రుల మార్పులు అవినీతి ఆరోపణలు ముందుకొచ్చాయి. నేదురుమల్లి జనార్ధనరెడ్డి హయాంలో క్యాపిటేషన్ కాలేజీలకు విచ్చలవిడిగా అనుమతినివ్వడంతో విద్యార్థి యువజనసంఘాలు గొప్ప ఉద్యమం నడిపించాయి. చివరకు ఆయన రాజీనామా చేయవలసి వచ్చింది. ఆ సమయంలోనే దేశంలో బిజెపి అధ్యక్షుడు ఎల్.కె.అద్వానీ రామరథయాత్ర పేరిట రాజకీయ చిచ్చు పెట్టారు. అవినీతికి వ్యతిరేకంగా ప్రజలు ఎన్నుకున్న విపిసింగ్ ప్రభుత్వాన్ని కూలగొట్టారు. అదే సమయంలో ఆంధ్ర ప్రదేశ్ రాజధాని హైదరాబాదులో కూడా మత కలహాలు ప్రజ్వరిల్లాయి. సిపిఎం దేశంలోనూ రాష్ట్రంలోనూ కూడా ఇతర వామపక్ష లౌకిక పక్షాలతో కలసి మత సామరస్య పునరుద్ధరణకు కృషి చేసింది.

**వరుస సవాళ్ల మధ్య...**

1991 ఎన్నికల మధ్యలో రాజీవ్ గాంధీ హత్యకు గురి కావడంతో కాంగ్రెస్ వారు మరోసారి ప్రతిపక్షాలపై దాడులు విధ్వంసాలకు పాల్పడ్డారు. ఆ సమయంలోనూ సిపిఎం ధైర్యంగా నిలబడి ప్రజలను సమీకరించింది. ఆయన హత్యానంతర సానుభూతితో కాంగ్రెస్ కేంద్రంలో ప్రధాని పి.వి.నరసింహారావు ప్రభుత్వం ఏర్పడింది. అది మన్మోహన్ సింగ్ ఆర్థిక మంత్రిగా నూతన ఆర్థిక విధానాల మోత ప్రారంభించింది. సంపన్న వర్గాలు జేజేలు కొడుతున్న ఈ విధానాలు దేశ ఆర్థిక స్వాతంత్ర్యానికి ముప్పు తెస్తాయని సిపిఎం వామపక్షాలు ముందే హెచ్చరించాయి. కాని కేంద్ర పాలకులు ధనాఢ్య వర్గాలను అంతర్జాతీయంగా బడా పెట్టుబడిదారీ దేశాలను సంతృప్తి పర్చేందుకై ఆ విధానాలనే కొనసాగించారు. ఫలితంగా హైదరాబాదు, విశాఖ పట్టణం వంటి చోట్ల ప్రభుత్వ సంస్థల

ఉనికికి ముప్పు ఏర్పడింది. హైదరాబాదులో అనేక ప్రతిష్టాత్మక ప్రభుత్వ రంగ సంస్థలు ప్రేవేటు పరమైనాయి. ఈ విధానాల ప్రమాదాన్ని ముందుగానే పసిగట్టి హెచ్చరించిన ప్రత్యేకత సిపిఎంకే దక్కుతుంది. ఈ విధానాలకు వ్యతిరేకంగా కార్మిక ఉద్యోగులను సమీకరించేందుకు కూడా సిపిఎం నిరంతరం కృషి చేసింది. ఇతరత్రా కూడా వారి హక్కుల కోసం మూసివేసిన ఫ్యాక్టరీలు తెరిపించడం కోసం నిరసనోద్యమాలు నిరాహారదీక్షలు నిర్వహించింది. నూతన ఆర్థిక విధానాల దాడి మొదలైన ఈ తరుణంలోనే అంతర్జాతీయంగా సోషలిస్టు శిబిరానికి తీవ్రమైన ఎదురుదెబ్బ తగిలింది. మిహాయిల్ గోర్బచెవ్ నాయకత్వం చేపట్టిన తర్వాత మొదలైన హానికర విధానాలు పరాకాష్టకు చేరాయి. 1989లో బెర్లిన్ గోడ పడగొట్టడంతో మొదలైన ఈ పరిణామాలు 1991 ఆగష్టులో ప్రథమ సోషలిస్టు రాజ్యమైన సోవియట్ యూనియన్ విచ్ఛిన్నం కావడంతో ముగిశాయి. నిజానికి కొన్ని కమ్యూనిస్టు పార్టీలు ఆయనకు నీరాజనాలర్పిస్తూ తాము కూడా పేర్లు విధానాలు మార్చుకున్నాయి. సోవియట్ ముక్కచెక్కలవుతుంటే ఇది గోర్బచెవ్ గొప్పతనమనీ ఆయన త్వరలోనే మొత్తం పునరుద్ధరిస్తాడని ప్రచారం చేశాయి. ఈ మధ్యలో చైనాలోనూ తియాన్ స్క్వేర్ ఘటనలు జరిగినప్పుడు కూడా ఆ సోషలిస్టు వ్యవస్థను తిట్టిపోశాయి. గోర్బచెవ్ విధానాలలోని. ప్రమాదాన్ని తొలుతనే పసిగట్టి హెచ్చరించిన ఘనత సిపిఎంకు దక్కుతుంది. సిపిఎం ఈ పరిణామాల పూర్వాపరాలను విమర్శనాత్మకంగా పరిశీలిస్తూనే సోషలిజాన్ని పరిరక్షించుకోవాలనే వైఖరి తీసుకున్నది. ఆ విధంగా సిద్ధాంత పరంగా నిశ్చలంగా నిలబడి నిశితమైన చైతన్యాన్ని ప్రదర్శించింది. 1992 డిసెంబర్ ఆరున ఆరెస్సెస్ బిజెపి నేతలు అయోధ్యలో బాబరీ మసీదు కట్టడాన్ని కుట్రపూరితంగా కూల్చివేశారు. దేశమంతా కల్లోలం చెలరేగింది. ఆ సమయంలో సిపిఎం ఇతర వామపక్ష లౌకిక శక్తులతో కలసి మత సామరస్యం కోసం లౌకికతత్వం కోసం విస్తృతమైన ఉద్యమం నడిపింది. ఈ విధంగా 1989-93 మధ్య రాజకీయ సైద్ధాంతిక రంగాలలో ఎదురైన ప్రతికూల పరిణామాలను సైద్ధాంతిక సమరశీల విధానంతో సిపిఎం అధిగమించి ఆశయానికి అంకితమైంది. మళ్లీ ప్రజా ఉద్యమాలను పెంపొందించింది.

### సారా వ్యతిరేకోద్యమం... సామాజిక తరగతుల పోరాటం

1992-93లోనే జన విజ్ఞాన వేదిక, మహిళా సంఘం ఆధ్వర్యంలో సారా వ్యతిరేక ఉద్యమం వూపందుకుంది. నెల్లూరు జిల్లాలో మొదలైన ఈ ఉద్యమం కొద్ది కాలంలోనే రాష్ట్రమంతటా వ్యాపించింది. సిపిఎం ఈ ఉద్యమానికి అండగా నిలిచింది. అప్పటి తెలుగుదేశం అధ్యక్షుడు ఎన్టీఆర్ తాము అధికారంలోకి వస్తే మద్య నిషేదం విధిస్తామని ప్రకటించారు. 1984 ఎన్నికలలో తెలుగుదేశం ఘన విజయం సాధించగా సిపిఎంకు 15

స్థానాలు వచ్చాయి. తెలుగుదేశంలో ఎన్టీఆర్ పాలనా విధానాలు నచ్చని చంద్రబాబు నాయుడు వంటివారు తిరుగుబాటు చేశారు. ఆ సమయంలో సిపిఎం కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఈ ప్రభుత్వానికి ప్రజలిచ్చిన తీర్పును కాపాడాలనే వైఖరి తీసుకున్నది. ఆ విధంగా అధికారం చేపట్టిన చంద్రబాబు నాయుడు మొదట వామపక్షాలతో సహకరిస్తూ జాతీయ స్థాయిలోనూ వాటితో కలసి యునైటెడ్ ఫ్రంట్‌లో పనిచేసింది. 1996లో ఫ్రంట్ ప్రభుత్వం ఏర్పడినప్పుడు చంద్రబాబు నాయుడును కన్వీనర్‌గా కూడా చేశారు. అయితే ఆయన అనుసరించిన ఆర్థిక విధానాలు కాపాడుకోవడం కోసం 1998 ఎన్నికల తర్వాత బిజెపితో చేతులు కలిపాడు. మతతత్వానికి వ్యతిరేకంగా పోరాడుతూనే సిపిఎం కులతత్వాలపై కూడా సమరశంఖం పూరించింది. కుల వివక్షతా వ్యతిరేక పోరాట సంఘం(కెవిపిఎస్)ను స్థాపించి సమరశీల ఉద్యమానికి నడుం కట్టింది. దీనిపై శాసనసభకు జరిగిన ప్రదర్శనపై పోలీసులు దారుణంగా దాడి చేశారు.అయినా చివరకు ఈ ఉద్యమం కోరినట్టుగా వెనకబడిన కులాల పరిస్థితిని అధ్యయనం చేసేందుకు జస్టిస్ పున్నయ్య అధ్యక్షతన ఒక కమిషన్‌ను నియమించాల్సి వచ్చింది. ఇది సామాజిక రంగంలో పెద్ద విజయం.

**విద్యుచ్ఛక్తి ఉద్యమ ఉత్తేజం**

సిపిఎం మొదటే హెచ్చరించినట్టు విరుచుకుపడుతున్న నూతన విధానాలు దేశానికి శాపంగా మారాయి. చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం విజన్2020 వంటి వాటితో ఈ విధానాలకు రాష్ట్రాన్ని ప్రయోగశాలగా మార్చివేసింది. ఆ పరిస్థితుల్లో అటు సరళీకరణ విధానాలు మరోవైపున మతతత్వానికి కూడా వ్యతిరేకంగా కూడా పోరాడవలసిన అవసరమేర్పడింది. ఈ సమయంలోనే చంద్రబాబు ప్రభుత్వం 2000లో విద్యుచ్ఛక్తి బోర్డును ముక్కలు చేసి రేట్లు పెంచి తీవ్ర వ్యతిరేకతకు కారణమైంది. ఈ పరిస్తితుల్లో సిపిఎం మరో ఎనిమిది వామపక్షాల వామపక్ష బృందాలతో కలసి విద్యుత్ ఉద్యమం ప్రారంభించింది. ప్రజల స్పందన గమనించిన తర్వాత కాంగ్రెస్ కూడా చేతులు కలపాల్సి వచ్చింది. 2000 ఆగస్టు 28న చలో అసెంబ్లీ సందర్భంగా బషీర్‌బాగ్ వద్ద జరిపిన కాల్పులు మూడు నిండు ప్రాణాలను బలిగొన్నాయి. అది మహోద్యమంగా విస్తరించి చంద్రబాబు సర్కార్‌కు ప్రాణ సంకటంగా తయారైంది. ఆఖరుకు కాంగ్రెస్ కూడా ఇందులో పాలుపంచుకోక తప్పని స్థితి ఏర్పడింది. సరళీకరణ యుగంలో ప్రజా ప్రతిఘటన ఏ విధంగా వుండాలనే దానిపై విద్యుచ్ఛక్తి ఉద్యమం ఒక గొప్ప అనుభవాన్నిచ్చింది. యావద్భారతాన్ని ప్రపంచాన్ని కూడా ఆకర్షించింది. 2002లో సిపిఎం అఖిలభారత మహాసభ హైదరాబాదులో జయప్రదంగా జరిగింది.అలాగే విద్యుదుద్యమ నేపథ్యంలో ప్రపంచ సామాజిక వేదిక ఆసియా విభాగం మహాసభలు కూడా జరిగాయి. ఆ విధంగా ప్రపంచీకరణకు ప్రయోగశాలగా మారిన రాష్ట్రాన్ని ప్రతిఘటనకూ కేంద్రంగా మార్చడంలో సిపిఎం కృషి

ఫలప్రదమైంది. నీటి మీటర్లు, యూజర్‌చార్జీలు, ఔట్ సోర్సింగు వంటి అనర్థక పద్ధతుల ప్రమాదాన్ని ప్రారంభంలోనే గుర్తించి హెచ్చరించడమే గాక ఉద్యమాలు కూడా నిర్వహించింది. ఆ దశలో జరిగిన అంగన్‌వాడీ వర్కర్ల ఉద్యమం, ఆర్టీసీలో సమ్మె గొప్ప రాజకీయ ప్రభావం చూపించాయి.

**ఎన్నికల విజయాలు, భూ పోరాటం**

2004 ఎన్నికలలో తెలుగుదేశం ఘోర పరాజయం పాలైంది. కేంద్రంలో వాజ్‌పేయి ఎన్‌డిఎ ప్రభుత్వాన్ని ,రాష్ట్రంలో చంద్రబాబు నాయుడును ఓడించడంలో సిపిఎం ముఖ్యపాత్రను అందరూ హర్షించారు. అయితే కొత్తగా అధికారానికి వచ్చిన యుపిఎ కేంద్రంలోనూ, వైఎస్‌రాజశేఖర రెడ్డి ప్రభుత్వం రాష్ట్రంలోనూ మొదట్లో కొంత జాగ్రత్తగా వ్యవహరించినా తర్వాత సహజ నైజంప్రదర్శించారు. పలితంగా ప్రజలపై దాడి పెరిగింది. ప్రభుత్వ భూములు విచ్చలవిడిగా కార్పొరేట్లకు దళారులకు కట్టబెట్టడంతో రేట్లు విపరీతంగా పెరిగిపోయాయి. ఆ సమయంలో పేదలకు కనీస గృహ వసతి కూడా లేని పరిస్థితికి వ్యతిరేకంగా సిపిఎం ప్రజా సంఘాల చొరవతో ప్రారంభమైన భూ పోరాటం సంచలనం కలిగించింది. ఖమ్మం జిల్లా ముదిగొండలో ఈ పోరాటంపై కాల్పులు జరిపి ఏడుగురి ప్రాణాలు బలిగొనడం తీవ్ర ఆగ్రహానికి దారి తీసింది.

**రాష్ట్ర విభజన, తాజా ఎన్నికలు**

2009 ఎన్నికల్లో కాంగ్రెస్ స్వల్ప ఆధిక్యతతోనే అధికారం నిలబెట్టుకోగలిగినా స్వల్ప కాలంలోనే ఆయన దుర్మరణం పాలుకావడంతో రాజకీయ అస్థిరత్వం తాండవించింది. టిఆర్ఎస్ అధ్యక్షుడు కె.చంద్రశేఖర రావు ఆమరణ నిరాహారదీక్ష విరమింపచేసేందుకు కేంద్రంలోని కాంగ్రెస్ నాయకత్వం డిసెంబర్9న రాష్ట్ర విభజన ప్రకటన చేసింది. అప్పటి నుంచి దాదాపు నాలుగేళ్లలో ఈ సమస్య పరిష్కరించకుండా పరిపరివిధాల మాట్లాడుతూ కేంద్రం ప్రజల జీవితాలతో చెలగాటమాడింది. ఈ సమయంలో కూడా సిపిఎం కెవిపిఎస్ తరపున నిరాహారదీక్ష జరిపి ఎస్‌సి ఎస్‌టి సబ్‌ప్లాన్‌ను సాధించడం గొప్ప విజయంగా చెప్పొచ్చు. పరస్పర వ్యతిరేకతలు పెంచుతున్న ఆ తరుణంలో జిల్లాలలో సమగ్రాభివృద్ధి యాత్రలు, సాగునీటి పాదయాత్రలు నిర్వహించింది. సిపిఎం భాషారాష్ట్ర విభజనకు వ్యతిరేకం గనక ఇతరుల వలె అవకాశవాద విన్యాసాలకు పాల్పడకుండా సూటిగా తన విధానానికి కట్టుబడటాన్ని అందరూ హర్షించారు. రాష్ట్రాలు ఒకటైనా రెండైనా పోరాటం అనివార్యం అనే నినాదంతో అది సమస్యలపై ప్రజలను సమీకరించింది.

**ఎన్నికల్లో అవాంచనీయ పోకడలు**

మొన్నటి ఎన్నికలలో కేంద్రంలో నరేంద్ర మోడీ నాయకత్వంలో బిజెపి పూర్తి మెజార్టి తెచ్చుకోవడం కాంగ్రెస్ ఘోర పరాజయం పాలు కావడం సంభవించాయి. సిపిఎం

వామపక్షాల బలం కూడా బాగా తగ్గిపోయింది. తాత్కాలిక ఉద్వేగాలు పాలక వర్గ పార్టీల ప్రచారార్భాటాల మధ్య సిపిఎంకు ఆంధ్ర ప్రదేశ్ శాసనసభలో ప్రాతినిధ్యం లభించలేదు. విచ్చలవిడిగా డబ్బు, ప్రలోభాలు మాత్రమే గాక కార్పొరేట్ శక్తులు పెద్ద పెద్ద కాంట్రాక్టర్లతోపాటు, కంపెనీల యజమానులు ప్రత్యక్షంగా ఎన్నికల్లో అభ్యర్థులయ్యారు.కనీవినీ ఎరుగని స్థాయిలో పార్టీ ఫిరాయింపుల నడుమ జరిగిన ఎన్నికల్లో ప్రజా సమస్యలకు తావులేకుండా పోయింది. కులం అస్త్రాన్ని బాగా ప్రయోగించారు మరోవంక 1998లో వలెనే తెలుగుదేశం అధినేత బిజెపితో జతకట్టడమే గాక ప్రభుత్వాలలో పరస్పర భాగస్వామ్యం తీసుకున్నారు.. గతంలో తను రెండు సార్లు ఓడిపోవడానికి కారణమైన విధానాలు సవరించుకోకపోగా చంద్రబాబు కార్పొరేట్ ఎజెండాను మరింత తీవ్రంగా అమలు చేస్తున్నారు. రుణమాఫీ వంటి వాగ్దానాలు నీరుగార్చి కొత్త కొత్త భారాలు వేసేందుకు ప్రజా వనరులు కార్పొరేట్ పరం చేసేందుకు సంసిద్ధులవుతున్నారు. తెలంగాణలో కెసిఆర్ ప్రభుత్వం కూడా అలాటి కార్యక్రమమే అమలు జరుపుతున్నది.

**కర్తవ్యాలకు పునరంకితం**

మోడీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత అటు మతోన్మాదం ఇటు మార్కెట్ శక్తుల కార్పొరేట్ దూకుడు కూడా తీవ్రమైనాయి.కార్మికులు ఉద్యోగుల హక్కులపై దాడి బాహాటంగా సాగుతున్నది. ఇలాటి సమయంలో వివిధ తరగతుల ప్రజల జీవన హక్కుల కోసం భద్రత కోసం లౌకిక ప్రజాస్వామ్య విలువల కోసం ఉద్యమించాల్సి వుంది. సరళీకరణ విధానాలకు బలవుతున్న సామాజిక తరగతులు ముఖ్యంగా దళిత గిరిజన మైనార్టీలు మహిళల కోసం ప్రత్యేకంగా కృషి జరగవలసి వుంది. రాజకీయ అవినీతి, పార్టీ ఫిరాయింపులు నిత్యకృత్యమైన నేటి వాతావరణంలో విలువలతో కూడిన రాజకీయాలను నిలబెట్టవలసిన బాధ్యత కమ్యూనిస్టులపై వుంది. దీనికి తోడు తెలుగు రాష్ట్రాలలో ఈ రెండు ప్రభుత్వాలూ సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవడానికి బదులు నిరంతర వివాదాలతో వాతావరణం కలుషితం చేస్తున్నాయి. వీటన్నిటిపై ప్రజలను సమీకరించి సమరశీల ఉద్యమాలు నడపాల్సిన కర్తవ్య నిర్వహణకు సిపిఎం వామపక్షాలు సిద్ధమవుతున్నాయి. పది వామపక్షాల బృందాల సమావేశాలు జరుగుతున్నాయి. ఎన్నికల పరాజయాలకు తోడు నేటి కలుషిత వాతావరణంలో కమ్యూనిస్టు స్ఫూర్తిని నిలబెట్టడం కోసం కూడా ప్రత్యేక కృషి అవసరమవుతున్నది.రకరకాల కులమత అస్తిత్వ రాజకీయాలు వ్యక్తి ప్రధాన రాజకీయాలు కార్పొరేట్ ప్రచార విన్యాసాలు ప్రజలను గందరగోళానికి గురి చేస్తున్నాయి. తాత్కాలిక మెరుపులతో ఏదో జరగబోతున్నదనే భ్రమలు కల్పించి సిద్ధాంతాలు ఆశయాలను అవహేళన చేసే దుష్ట సంస్కృతి ప్రబలుతున్నది. విశ్వరూపం దాల్చిన కార్పొరేట్ మీడియా అంతర్జాతీయంగా అమెరికా ఆధిపత్యం నిరంతరం కమ్యూనిస్టు ఉద్యమంపై భావజాలంపై

దాడి చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో తాజా ఎన్నికల ఫలితాలు మరింత తీవ్రమైన సవాలును విసిరాయి. పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ అధికారంలోకి రావడంతో పాటు సిపిఎం బాగా దెబ్బతినడం, బిజెపికి గణనీయంగా ఓటింగు పెరగడం ఆందోళన కలిగిస్తున్నాయి. వామపక్ష ప్రజాతంత్ర శక్తుల ఐక్యత, లౌకిక పక్షాల సమీకరణకు తోడు ఆర్థిక రంగంలో ప్రమాదాలను తిప్పికొట్టకపోతే ముందు ముందు పేద మధ్యతరగతి ప్రజల జీవితాలు మరింత దుర్భరం కావడం తథ్యం. సామాజికంగా అణచివేతకు వెనకబాటుకు గురైన తరగతులకు సామాజిక రక్షణ కవచం సాధించవలసి వుంది. దేశీయ వ్యాపారాలను దెబ్బతీసేలా ఎఫ్‌డిఐల ప్రవేశం పెను ముప్పు తీసుకొస్తుంది. యాభై ఏళ్లలో ప్రజా ఉద్యమాలను సైద్ధాంతిక విశిష్టతను స్మరించుకునే సందర్భంలో సిపిఎం నేటి పరిస్థితులకు తగినట్టు తనను తాను సమాయత్తం చేసుకుంటుంది. జాతీయోద్యమంలో నాడు కాంగ్రెస్ అధినివేశ ప్రతిపత్తికి పరిమితమైతే కమ్యూనిస్టులు తొలుత సంపూర్ణ స్వాతంత్ర్యం నినాదం ఇచ్చారు. నాడు బ్రిటీష్ పాలకులు కమ్యూనిస్టుల్ని దేశవ్యాపితంగా అరెస్టు చేసి జైళ్ళలో కుక్కారు. అలాగే ఈనాడు కార్పొరేటీకరణ ప్రైవేటీకరణ ప్రమాదకరంగా పెరిగిపోయాయి. ఈనాడూ కమ్యూనిస్టులు వామపక్షాలే మళ్ళీ సరళీకరణ - ప్రయివేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా రాజీలేని పోరాటంలో ఉన్నాయి. కార్మిక రైతు సంఘాలు విద్యార్థి యువజన సంఘాలు మహిళలు సామాజిక తరగతులు అన్నిటిలో మరింత చొరవగా ముందుకు సాగడానికి సంసిద్ధమవుతున్నాయి. పోరాటాలకు పదును పెంచడం ప్రధాన కర్తవ్యంగా ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగే 21వ అఖిల భారత మహాసభకు విశాఖపట్టణం వేదిక కానుంది. మీ అందరి తోడ్పాటుతో భవిష్యత్తులో మరింత మంచి ఫలితాలు సాధిస్తామని విశ్వసిస్తున్నాం. ఈ యాభై ఏళ్ల ప్రస్థానంలో పాలు పంచుకుని అనేక త్యాగాలతో ఎర్రజండా ఎగరేసిన కార్యకర్తలందరికీ విప్లవాభినందనలు. అందుకు సహకరించిన శ్రేయోభిలాషులకు ధన్యవాదాలు. ఈ పరీక్షా సమయంలో సవాళ్లను అధిగమించి ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లేందుకు ప్రతివారి సహాయ సహకారాలు అభ్యర్థిస్తున్నాం.

◆◆◆


వెల : ₹ 5/-

ప్రతులు : 50,000

ప్రచురణ

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఆంధ్రప్రదేశ్

1-1-60/2, యం.బి.భవన్,

ఆర్‌టిసి క్రాస్ రోడ్స్, ముషీరాబాదు, హైదరాబాద్ -20